చోరీకి వచ్చి.. సీసీ కెమెరా చూసి

- పరారైన మహిళా ఆగంతకురాలు
- వేములవాడలో అర్ధరాత్రి ఘటన

వేములవాడ, జూలై 27: ఓ మహిళా ఆగంతకురాలు శుక్రవారం అర్ధరాత్రి దర్జాగా చోరీ చేసేందుకు ప్రయత్నం చేసి, నిరాశగా వెనుదిరిగిన ఘటన వేములవాడ పట్టణంలో చోటుచేసుకున్నది. వివరాల్లోకి వెళ్తే.. పట్టణంలోని ప్రధాన రహదారిలో సంతోష్ అనే వ్యాపారి సెల్‌పాయింట్ దుకాణాన్ని నిర్వహిస్తున్నాడు. శనివారం తెల్లవారుజామున మహిళా ఆగంతకురాలు సదరు దుకాణం తాళం పగలగొట్టేందుకు తీవ్ర ప్రయత్నం చేసింది. ఎంతకీ తాళం పగలకపోవడంతో పక్కన ఉన్న మరో షాపులో చోరీకి ప్రయత్నించింది. అయితే సీసీ కెమెరాలు ఉన్నట్టు పరిశీలించి.. మెల్లగా అక్కడి నుంచి జారుకున్నది. సదరు యజమాని శనివారం ఉదయం షాపు తెరిచి ఒకసారి సీసీ కెమెరాలు పరిశీలించడంతో సదరు ఆగంతకురాలి ప్రయత్నాలన్ని నిక్షిప్తం

సీసీ కెమెరాలో చిక్కిన మహిళా ఆగంతకురాలు

కావడంతో అతడు స్నేహితులతో పంచుకున్నాడు. ఈ వీడియోలు సామాజిక మాధ్యమాలో వైరల్ అయ్యాయి. నేరాలను నియంత్రించాలంటే సీసీ కెమెరాలు తప్పనిసరి అని పోలీసులు హెచ్చరిస్తున్న తీరు సదరు సెల్ పాయింట్ దుకాణం యజమానికి అక్షరాల నిజమైంది.

చలో హైదరాబాద్‌కు తరలిన ఆసాములు, కార్మికులు

హైదరాబాద్‌కు ప్రత్యేక బస్‌లో తరలివెళ్తున్న ఆసాములు, కార్మికులు

సిరిసిల్ల రూరల్, జూలై27: వస్త్ర వ్యాపార సంఘాల నేతలు చేపట్టిన చలో హైదరాబాద్ మహా ధర్నాకు తంగళ్లపల్లి మండల కేంద్రంలోని ఆసాములు, కార్మికులు తరలి వెళ్లారు. హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద వస్త్ర వ్యాపార యజమానులు, అనుబంధ సంఘాల నాయకులు చేపట్టిన మహా ధర్నాలో పాల్గొన్నారు. మోర రాజు, కిరణ్, సామల శ్రీనివాస్, కుమ్మరి కుంట శ్రీహరి, వేముల బాలకిషన్, గజ్జెల్లి శ్రీనివాస్, కుడికాల కనకయ్య, కారంపురి సురేశ్, తదితరులు తరలివెళ్లారు.

ఇసుక ట్రాక్టర్లను అడ్డుకున్న యువకులు

ఇసుక ట్రాక్టర్లను అడ్డుకుంటున్న యువకులు

ముస్తాబాద్, జూలై 27: పోతుగల్‌లో అతి వేగంగా వస్తున్న ఇసుక ట్రాక్టర్లను గ్రామానికి చెందిన కొందరు యువకులు అడ్డుకున్నారు. పోతుగల్ నుంచి నిత్యం అనేక ట్రాక్టర్లు వెళ్తున్నాయని, అతి వేగంగా నడపడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. ట్రాక్టర్లను అడ్డుకొని పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఇక్కడ తోట ధర్మేందర్, కావటి మహిపాల్, జంగరాజు, తదితరులు ఉన్నారు.

పూర్వ విద్యార్థులను స్ఫూర్తిగా తీసుకోవాలి

వేములవాడ రూరల్, జూలై 27: పూర్వ విద్యార్థులను స్ఫూర్తిగా తీసుకొని ముందుకెళ్లాలని ఎస్ఆర్ఆర్ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ రాజగోపాల్ సూచించారు. శనివారం అగ్రహారంలోని పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించిన అలుమ్ని టాక్స్ అనే కార్యక్రమానికి రైల్వే చీఫ్ విజిలెన్స్ అధికారి గాజుల శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ, కళాశాలలో 1997-2000 సంవత్సరంలో ఎలక్ట్రికల్ విభాగంలో చదివిన గాజుల శ్రీనివాస్ ఉన్నతస్థాయిలో ఉద్యోగం చేస్తున్నాడని, అతడిని విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. ఇక్కడ ఎలక్ట్రికల్ శాఖాధిపతి రవీందర్, ఉపన్యాసకులు హిమజ, హసీనాబేగం, నర్మద, విద్యార్థులు ఉన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED
PLOT FOR SALE

★YTDA Final Approved 92 Acres Mega Venture @ Bhuvanagiri Town Open Plots for Sale. Opp: Viver Hotel & Collectorate Building 100, 60, 40, 30 All CC Roads & Beautiful Parks, Avenue Plantation, Bank Loans AVL. 9949997199 / 9440415567 / 9866863131.
NT-327686

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 91827 77571
91827 77194

సీపీఆర్‌పై అవగాహన ఉండాలి

- కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా
- కలెక్టరేట్‌లో అన్ని శాఖల అధికారులకు ప్రత్యేక శిక్షణ

కలెక్టరేట్, జూలై 27: జిల్లాలో సీపీఆర్ (కార్డియో పల్మనరీ రిసోసియేషన్)పై అందరికీ అవగాహన ఉండాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పేర్కొన్నారు. శనివారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో అన్ని శాఖల ఉన్నతాధికారులు, సిబ్బంది, వైద్యులకు రెనే దవాఖాన క్రిటికల్ కేర్ వైద్యుడు లతీశ్‌రెడ్డి సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాలు ఎలా కాపాడాలి అనే అంశంపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ సీపీఆర్ శిక్షణపై అవగాహన కలిగి ఉండాలని, తద్వారా ఇంకొకరి ప్రాణాలు కాపాడే అవకాశం ఉందన్నారు. డీఎంహెచ్‌వో వసంతరావు మాట్లాడుతూ, రాబోయే రోజుల్లో జిల్లాలోని అన్ని వర్గాల ప్రజలకు ఈ శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా వైద్యశాఖ సహకారంతో నిర్వహిస్తామని తెలిపారు. తర్వాత అదనపు కలెక్టర్ భీమ్యానాయక్ సీపీఆర్ చేసి చూపించారు. సీపీఆర్‌పై అవగాహనతో విలువైన ప్రాణాలు కాపాడవచ్చని వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో రాజగోపాల్, ప్రోగ్రాం ఆఫీసర్ ఉమాదేవి, రెనే దవాఖాన జనరల్ మేనేజర్ అరవింద్‌రావు, మార్కెటింగ్ మేనేజర్ ప్రసాద్, బయో మెడికల్ సిబ్బంది ప్రపుల్, ప్రశాంత్ పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో సిబ్బందికి సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

మాదక ద్రవ్యాల నియంత్రణకు చర్యలు

మాదకద్రవ్యాల వినియోగంతో కలిగే నష్టాలపై విస్తృత ప్రచారం చేస్తూ, నియంత్రణకు పకడ్బందీగా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. మాదకద్రవ్యాలు, డ్రగ్స్ నియంత్రణపై శనివారం కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి నార్కోటిక్ కంట్రోల్ సమావేశం నిర్వహించగా, ఎస్పీ అఖిల్‌మహాజన్ హాజరయ్యారు. జిల్లాలో నమోదవుతున్న ఎన్‌డీపీఎస్ కేసులు, గంజాయి సాగు నివారణ చర్యలు, మాదకద్రవ్యాల వాడకం నియంత్రణ చర్యలు, మాదక ద్రవ్యాల నివారణ కోసం శాఖల చేపట్టాల్సిన కార్యక్రమాలపై చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, డ్రగ్స్‌తో కలిగే విపరీత పరిణామాలపై అవగాహన కల్పిస్తూనే.. వాటి నియంత్రణకు అధికారులు సమన్వయంతో కృషి చేయాలన్నారు. అటవీ శాఖ అధికారులు వారి పరిధిలోని అటవీ భూములను పరిశీలించి గంజాయి సాగు కనిపిస్తే వెంటనే పోలీస్ అధికారులకు సమాచారం అందించాలన్నారు. జిల్లాలోని దవాఖానలు, మెడికల్ షాపులలో స్టాక్ వివరాలను ప్రతినెల తనిఖీ చేయాలని అధికారులకు సూచించారు. మాదకద్రవ్యాల నియంత్రణ కోసం ప్రతి మూడు నెలలకోసారి జిల్లా స్థాయి నార్కోటిక్ కంట్రోల్ సమావేశం ఏర్పాటు చేయనున్నట్టు చెప్పారు. ఎస్పీ మాట్లాడుతూ, జిల్లాలో గంజాయి నియంత్రణకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టామని తెలిపారు. డ్రంకెన్ డ్రైవ్ తరహాలో గంజాయి కిట్లతో తనిఖీలు చేస్తున్నామని, పాజిటివ్ వచ్చిన వారి నుంచి సరఫరాదారుల వివరాలు సేకరిస్తున్నట్టు చెప్పారు. సమావేశంలో సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవోలు రమేశ్, రాజేశ్వర్, జిల్లా అటవీ అధికారి బాలమణి, డీఈవో రమేశ్‌కుమార్, డీఎంహెచ్‌వో వసంత్‌రావు, జిల్లా డ్రగ్ ఇన్‌స్పెక్టర్ భవాని, తదితరులు పాల్గొన్నారు.

వర్షాల నేపథ్యంలో జాగ్రత్తగా ఉండాలి

బోయినపల్లి, జూలై 27: జిల్లాలో వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలందరూ జాగ్రత్తగా ఉండేలా అధికారులు క్షేత్రస్థాయిలో ఉంటూ అప్రమత్తం చేయాలని వేములవాడ ఆర్డీవో రాజేశ్వర్ సూచించారు. శనివారం తహసీల్ కార్యాలయంలో కార్యదర్శులకు పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, మరో రెండు రోజులు జిల్లాకు వర్ష సూచనలు ఉండడంతో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. గొర్రెల కాపరులు, రైతులు వాగులు దాటే ప్రయత్నం చేయవద్దని కోరారు. కార్యదర్శులు గ్రామాలలో ఎప్పటికప్పుడు పరిస్థితులను పర్యవేక్షించాలన్నారు. శిథిలావస్థకు చేరిన ఇండ్లల్లో ఎవరైన ఉంటే సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. ఇక్కడ తహసీల్దార్ పుష్పలత, తదితరులు ఉన్నారు.

సీపీఆర్‌పై అవగాహన పెంపొందించుకోవాలి

తెలంగాణ చౌక్, జూలై 27: అత్యవసర సమయంలో ప్రాణాలు కాపాడే సీపీఆర్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని డీఈవో రమేశ్‌కుమార్ సూచించారు. జిల్లా కేంద్రంలోని గీతానగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో సీపీఆర్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. సీపీఆర్‌పై అవగాహన కలిగి ఉండడంతో మరొక్కరి ప్రాణాలు కాపాడే అవకాశం ఉంటుందని విద్యార్థులకు పవర్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఇక్కడ డీఎంహెచ్‌వో వసంతరావు, వైద్యులు లతీశ్, హెచ్ఎం శారద, ఉపాధ్యాయులు ఉన్నారు.

అంబేద్కర్ చౌరస్తాలో చేపట్టిన దీక్షలో కూర్చున్న నేతన్నలు

ఆరో రోజుకు నేతన్నల దీక్షలు

రాజన్న సిరిసిల్ల, జూలై 27 (నమస్తే తెలంగాణ): వస్త్ర పరిశ్రమలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నేతన్నలు చేపట్టిన రిలే దీక్షలు శనివారంతో ఆరో రోజుకు చేరుకున్నాయి. సిరిసిల్ల అంబేద్కర్ చౌరస్తాలో చేపట్టిన దీక్షలను శనివారం పాలిస్టర్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు దూడం రమేశ్ ప్రారంభించారు. దీక్షలో యూనియన్ గౌరవాధ్యక్షుడు ఉడుత రవి, జిందం మహేశ్, మరి పెద్ది ప్రభాకర్, జిందం రవి, చందుపట్ల పోశమల్లు, బొచ్చు రాంచంద్రం, మంగళారపు లక్ష్మీనారాయణ, జిందం దేవదాస్ ఉన్నారు.

అధికారులపై చర్యలు తీసుకోవాలి

సిరిసిల్ల టౌన్, జూలై27: పెద్దాపూర్ గురుకుల పాఠశాలలో విద్యార్థుల మరణానికి కారణమైన అధికారులపై చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్‌వీ రాష్ట్ర నాయకుడు కంచర్ల రవిగౌడ్ డిమాండ్ చేశారు. తెలంగాణ భవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పాఠశాలలు ప్రారంభమై రెండు నెలలు గడుస్తున్నా.. ప్రభుత్వం విద్యా వ్యవస్థపై నిర్లక్ష్యం చేస్తున్నదని మండిపడ్డారు. గురుకులాలను గాలికి వదిలేసిందని మండిపడ్డారు. ఇక్కడ శ్రీనివాస్, నవీన్, వెంకటేశ్, సుజిత్, రోహిత్, సాయి, హర్షిత్ ఉన్నారు.

పెద్దమ్మ ఆలయంలో చోరీ

ఎల్లారెడ్డిపేట, జూలై 27: బొప్పాపూర్ శివారులోని పెద్దమ్మ ఆలయంలో శనివారం చోరీ జరిగింది. రోజువారి మాదిరిగా కోల నరేశ్ ఆలయాన్ని శుభ్రపరిచేందుకు వెళ్లగా, తాళం పగలగొట్టి ఉండడం, అమ్మవారి పుస్తె మట్టెలు, ముక్కు పుడక కనిపించకపోవడంతో పోలీసులకు సమాచారమిచ్చారు. సీఐ శ్రీనివాస్‌గౌడ్, ఎస్ఐ రమాకాంత్ క్లూస్ టీమ్‌తో వివరాలు సేకరించారు.

కూలి కోసం వెళ్లి.. మృత్యుఒడిలోకి..

- కర్ణాటకలో యాక్సిడెంట్.. జిల్లా వాసి మృతి
- తంగళ్లపల్లి మండలం కేసీఆర్‌నగర్‌లో విషాదం

పాషా (ఫైల్)

సిరిసిల్ల రూరల్, జూలై27: కూలి పనుల కోసం కర్ణాటక వెళ్లగా, అక్కడ గుర్తుతెలియని వాహనం ఢీకొని జిల్లావాసి మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే.. తంగళ్లపల్లి మండలం మండెపల్లి శివారులోని కేసీఆర్‌నగర్‌లో ఖాజాపాషా (50) ఉంటున్నాడు. కూలీ చేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. ఈ నెల 26న సిరిసిల్ల నుంచి మట్టి వినాయక విగ్రహాల కర్ణాటకలోని బెంగళూరుకు వెళ్లింది. దీంతో పాషాతోపాటు మరో ఇద్దరు విగ్రహాలను అన్‌లోడ్ చేసేందుకు బెంగళూరుకు వెళ్లారు. అక్కడ విగ్రహాలను అన్‌లోడ్ చేసిన తర్వాత రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో పాషా అక్కడికక్కడే మృతి చెందాడు. పాషా మృతితో కేసీఆర్‌నగర్‌లో విషాదం నెలకొన్నది.

రోడ్డుపై నాటు వేసి నిరసన

మంగళ్లపల్లిలో రోడ్డుపై నాట్లు వేసి నిరసన తెలుపుతున్న యువకులు

కోనరావుపేట, జూలై 27: వానకాలం నేపథ్యంలో మంగళ్లపల్లిలో రోడ్లన్నీ గుంతలమయంగా మారి బురదమయమయ్యాయి. దీంతో వాహనాదారులు, పాదచారులు రోడ్డుపై వెళ్లేందుకు ఇబ్బంది పడుతున్నారు. ఈ క్రమంలో యువకులంతా కలిసి రోడ్డుపై వరి నాటు వేసి నిరసన తెలిపారు. అధికారులు చొరవ చూపి సమస్యను పరిష్కరించాలని కోరారు. ఇక్కడ ఊరడి మధు, ఉప్పుల శ్రీకాంత్, సాసాల రాకేశ్, ఉప్పుల రాకేశ్, జలంధర్, వినయ్ ఉన్నారు.

పాఠశాలల్లో ఘనంగా బోనాల పండుగ

ముస్తాబాద్: పోతరాజు వేషధారణలో విన్యాసాలు చేస్తున్న నవజ్యోతి పాఠశాల విద్యార్థులు

వేములవాడ టౌన్/ చందుర్తి/ఇల్లంతకుంట/కోనరావుపేట/ముస్తాబాద్/తెలంగాణ చౌక్/సిరిసిల్ల రూరల్, జూలై 27: ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని జిల్లాలోని పలు ప్రాఠశాలల్లో శనివారం పోచమ్మ బోనాల పండుగను ఘనంగా నిర్వహించా రు. అమ్మవారి, పోతరాజుల వేషధారణలో చిన్నారులు ఆకట్టుకున్నారు. బోనాలతో ఊరేగింపుగా పోచమ్మ ఆలయానికి వెళ్లి, అమ్మవారికి బోనాలు సమర్పించారు. చందుర్తి మండలం మల్యాలలో సాధన పాఠశాల, ఇల్లంతకుంట మండలం కందికట్కూర్, జంగంరెడ్డిపల్లిలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల్లు, కోనరావుపేట మండలం కొలనూర్‌లోని మార్గదర్శి పాఠశాల, ముస్తాబాద్ మండల కేంద్రంలోని నవజ్యోతి ఇంగ్లిష్ మీడియం స్కూల్, సిరిసిల్లలోని విజ్ఞాన్ హైస్కూల్, తంగళ్లపల్లి మండల కేంద్రంలోని శ్రీసరస్వతి, శుభోదయ పాఠశాలలో బోనాలు వేడుకలు నిర్వహించారు. అలాగే వేములవాడలోని శిశుమందిర్ పాఠశాల విద్యార్థులు బద్ది పోచమ్మ అమ్మవారికి బోనాలు సమర్పించారు.విద్యార్థులకు బోనాల విశిష్టతను ప్రిన్సిపాల్స్ వివరించారు.

సీఎం రేవంత్‌రెడ్డికి ఆహ్వాన పత్రిక అందజేస్తున్న నారాయణరెడ్డి ట్రస్ట్ సభ్యులు, పక్కన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

సినారె జయంతికి రావాలని సీఎంకు ఆహ్వానం

వేములవాడ, జూలై 27: జ్ఞానపీఠ్ పురస్కార గ్రహీత పద్మభూషణ్ డాక్టర్ సింగిరెడ్డి నారాయణరెడ్డి జయంతిని పురస్కరించుకొని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి హైదరాబాద్‌లో శనివారం ట్రస్ట్ సభ్యులు ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ నెల 29న హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించే విశ్వాంభర సినారె జాతీయ సాహిత్య పురస్కార ప్రదానోత్సవం, నూతన పుస్తకావిష్కరణ కార్యక్రమానికి రావాలని ఆహ్వాన పత్రిక అందించారు. ఇక్కడ ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

నిమ్మపల్లి మూలవాగుకు జలకళ

కోనరావుపేట, జూలై 27: మండలానికి ప్రధాన జలవనరైన నిమ్మపల్లి మూలవాగులోకి వరద చేరుకోవడంతో ప్రాజెక్టు జలకళను సంతరించుకున్నది. మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా ఎగువ ప్రాంతాల్లో ముసురు పడడంతో వరద వస్తున్నది. దీంతో 19అడుగుల సామర్థ్యం గల ప్రాజెక్టుకు వరద నీరు చేరుతుండడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. ప్రాజెక్టు నిండితే పూర్తి స్థాయిలో వరి పంట సాగు చేసే అవకాశం ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు.

నిమ్మపల్లి మూలవాగు ప్రాజెక్టులో పెరిగిన వరద నీరు

సినారె జయంతి వేడుకలు

ముస్తాబాద్, జూలై 27: బంధనకల్ ఉన్నత పాఠశాలలో డాక్టర్ సింగిరెడ్డి నారాయణరెడ్డి జయంతి వేడుకలు శనివారం ముందస్తుగా నిర్వహించారు. విద్యార్థులకు కథలు కవితలతోపాటు వివిధ పోటీలు నిర్వహించారు. ప్రతిభ చూపిన వారికి పత్తిపాక ఫౌండేషన్, గరిపెల్లి ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రశంసా పత్రాలు అందించారు. ఇక్కడ హెచ్ఎం రాజ్‌కుమార్, ఉపాధ్యాయులు ఉన్నారు.

కేక్ కోసి.. స్వీట్లు పంచి..

చంద్రశేఖర్‌రావు బర్త్‌డే వేడుకల్లో పాల్గొన్న వైద్యులు, నాయకులు

ముస్తాబాద్, జూలై 27: టీఎస్‌పీఎస్సీ మాజీ డైరెక్టర్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు డాక్టర్ ఎరవెల్లి చంద్రశేఖర్ జన్మదిన వేడుకలను శనివారం మండల కేంద్రంలోని తిరుమల నర్సింగ్ హోంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు, సిబ్బంది, ప్రజా ప్రతినిధులు కేక్ కట్ చేసి.. స్వీట్లు పంచారు. ఇక్కడ బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ జిల్లా వెంకటస్వామి, సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు సురేందర్‌రావు, ఈసరి కృష్ణ, సత్యం, వైద్యులు ఉన్నారు.

పాఠశాలకు బ్యాండ్ వితరణ

గంభీరావుపేట, జూలై 27: మల్లారెడ్డిపేట ప్రాథమిక పాఠశాలకు శనివారం గ్రామస్తుడు చెకోటి మహేశ్‌యాదవ్ దంపతులు బ్యాండ్ వితరణ చేశారు. ఇక్కడ హెచ్ఎం మరాఠి అజయ్, ఎస్ఎంసీ చైర్మన్ రజిత, సింగిల్‌విండో డైరెక్టర్ బాల్‌రెడ్డి, ఉపాధ్యాయులు ఉన్నారు.

మొక్కలు నాటిన పేరెంట్స్

వీర్నపల్లి, జూలై27: గర్జనపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో శిక్ష సప్త: కార్యక్రమంలో భాగంగా శనివారం ఏకో క్లబ్ ఏర్పాటు చేశారు. పాఠశాల ఆవరణలో విద్యార్థులతో కలిసి పేరెంట్స్ మొక్కలు నాటారు. భవిష్యత్తులో విద్యార్థులు, పేరెంట్స్‌కు గుర్తిండిపోయేలా ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్టు హెచ్ఎం శ్రీనివాస్ తెలిపారు.

రహదారికి మరమ్మతు

బోయినపల్లి, జూలై27: మండల కేంద్రం నుంచి మర్లపేట, విలాసాగర్ గ్రామాల మీదుగా నర్సింగాపూర్ వెళ్లే రహదారిని ఎంపీడీవో జయశీల మరమ్మతు చేయించారు. రహదారికి ఇరువైపులా ముళ్ల చెట్లు ఏపుగా ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారని గ్రామస్తులు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు ఎమ్మెల్యే ఆదేశాలతో ఎంపీడీవో కూలీల సాయంతో రోడ్డును చదును చేయించారు. అదేవిధంగా మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ పాఠశాలలో మురుగు కాలువ నీరు వెళ్లకపోవడంతో దుర్వాసన రాగా, మాజీ సర్పంచ్ సంబ లక్ష్మీరాజం సహకారంతో కాలువను శుభ్రం చేయించారు. అలాగే మోడల్ స్కూల్ రహదారికి మొరం పోయించారు.

ఎస్సీ కమిషన్‌కు ఫిర్యాదు చేస్తాం

సిరిసిల్ల టౌన్, జూలై27: విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ ఎస్సీ, ఎస్టీ సమావేశం నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులపై ఎస్సీ కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు, సెస్ డైరెక్టర్ సుధాకర్ పేర్కొన్నారు. శనివారం సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం కలెక్టరేట్ సమావేశ మందిరలో ఉదయం 10గంటలకు ఉంటుందని ఇచ్చిన సమాచారం మేరకు తాము అక్కడికి చేరుకున్నామన్నారు. కాగా అధికారులు సమయాన్ని మధ్యాహ్నం 2గంటలకు ఉంటుందని మరోసారి సమాచారమిచ్చి, తర్వాత వాయిదా వేశారన్నారు. గతంలోనూ రెండుసార్లు సమావేశం నిర్వహించలేదని గుర్తు చేశారు. కలెక్టర్ అధ్యక్షతన జరగాల్సిన సమావేశంలో నిర్లక్ష్యంపై తాము ఎస్సీ కమిషన్‌తోపాటు సంబంధిత మంత్రికి ఫిర్యాదు చేస్తామని స్పష్టం చేశారు. ఇక్కడ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు, నాయకులు, తదితరులు ఉన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

సిరిసిల్ల టౌన్, జూలై 27: జిల్లా కేంద్రంలోని మూడో వార్డులో శనివారం మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ పలువురు లబ్ధిదారులకు మంజూరైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. భారతికి ₹ 21వేలు, పీ లక్ష్మికి ₹ 18వేలు, అనూషకు ₹11,500, సుష్మకు ₹ 11,500 విలువైన చెక్కులు అందజేశారు. ఇక్కడ బీఆర్ఎస్ నాయకులు, వార్డు కమిటీ సభ్యులు ఉన్నారు.

అప్రమత్తంగా ఉండాలి : ఎస్పీ

తెలంగాణ చౌక్, జూలై 27: సామాజిక మాధ్యమాల్లో వచ్చే ప్రకటనలు చూసి మోసపోవద్దని ఎస్పీ అఖిల్‌మహాజన్ శనివారం ఒక ప్రకటనలో సూచించారు. వారం రోజుల్లో జిల్లాలో జరిగిన సైబర్ నేరాల వివరాలను ఆయన వెల్లడించి, అవగాహన కల్పించారు. ఆన్‌లైన్ మార్కెటింగ్, చైన్ మార్కెటింగ్, లోన్ యాప్, లాటరీ, పార్ట్‌టైమ్ జాబ్, తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభం, పింక్ వాట్సాప్ పేరుతో మెసేజ్‌లు రాగానే ఆశపడి మోసపోకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. మనం ఫోన్ వాడేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని, మీ ప్రమేయం లేకుండా ఓటీపీ వస్తే దాన్ని ఎవరికీ చెప్పవద్దని సూచించారు. సామాజిక మాధ్యమాలు, సోషల్ మీడియాలో పూర్తి వ్యక్తిగత సమాచారం అందుబాటులో ఉంచకూడదన్నారు. ఏదైనా సైబర్ క్రైమ్ జరిగిన వెంటనే 1930కి కాల్ చేస్తే పొగోట్టుకున్న డబ్బులు తిరిగి పొందే అవకాశం ఉందన్నారు.

ఉజ్జయినీ మహంకాళి బోనాలు ప్రారంభం

వేములవాడ టౌన్, జూలై 27: ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని వేములవాడ పట్టణంలోని బ్రిడ్జి వద్ద ఉజ్జయినీ మహంకాళి జాతర ఉత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. శాఖాంబరి అవతారంతో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. విజయవాడకు చెందిన ప్రభ బృందం ఆధ్వర్యంలో పోతరాజుల విన్యాసాలు, నృత్యాలతో డప్పుచప్పుళ్ల మధ్య ఆదివారం అమ్మవారిని పురవీధులగుండా ఊరేగిస్తామని మహంకాళి ఆలయ చైర్మన్ శ్రీనివాస్ తెలిపారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

సిరిసిల్ల రూరల్, జూలై 27: 33/11 కేవీ సబ్‌స్టేషన్ మెయింటనెన్స్ నేపథ్యంలో తంగళ్లపల్లి మండల కేంద్రంతోపాటు గోపాల్‌రావుపల్లె, మండెపల్లి, తాడురులో ఆదివారం ఉదయం 10నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరాలో నిలిపివేస్తామని సెస్ ఏఈ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

రుద్రంగి, జూలై 27: మండల కేంద్రంలో ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని చందర్తి సెస్ ఏఈ మహేశ్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు.

'బడి తోట' పెంపకం పరిశీలన

సిరిసిల్ల రూరల్, జూలై 27: తంగళ్లపల్లి మండలం ఓబులాపూర్‌లోని జడ్పీ హెచ్ఎస్ పాఠశాలలో కురగాయల పంట (బడి తోట) పెంపకాన్ని ఎంపీడీవో లక్ష్మీనారాయణ శనివారం పరిశీలించారు. తోటల పెంపకంతో విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందించవచ్చని తెలిపారు. ఇక్కడ హెచ్ఎం ఉపేందర్ ఉన్నారు.

వివాహిత బలవన్మరణం

ఎల్లారెడ్డిపేట, జూలై 27: అల్మాస్‌పూర్‌కు చెందిన తలారి రాజమణి-రాములు కూతురు గీత(37)తో సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం రాజక్కపేటకు చెందిన శంకర్‌కు ఏడాదిన్నర క్రితం వివాహమైం